కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు అప్రమత్తంగా ఉండాలి

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



వనస్థలిపురంలో పార్టీ నాయకులతో సమావేశమైన మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు పార్టీ డివిజన్ అధ్యక్షులు, పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని డివిజన్ల ఇన్‌చార్జీలు, డివిజన్ల అధ్యక్షులతో మంగళవారం వనస్థలిపురంలోని పార్టీ కార్యాలయంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి పోలింగ్ ముగిసేంత వరకు కార్యకర్తలు ఎంతో శ్రమించి పని చేశారన్నారు. కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, వారికి పాసులు పొందడం, పోలీస్ వెరిఫికేషన్ తదితర ప్రక్రియ అంతా డివిజన్ల ఇన్‌చార్జీలు, అధ్యక్షులు పూర్తి చేయాలని సూచించారు. సోమవారం జరిగిన పోలింగ్ ఓటింగ్ సరళి, విజయావకాశాలు తదితర అంశాలపై నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాతా నాయక్, నాయకులు చలకాని వెంకట్‌యాదవ్, తులసి శ్రీనివాస్, వజీర్ ప్రకాష్‌గౌడ్, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మకుటం సదాశివుడు, కుట్ల నర్సింహయాదవ్, వేణుగోపాల్ యాదవ్, చెన్నగోని రవి, బుడ్డ సత్యనారాయణ, కిషోర్‌గౌడ్ పాల్గొన్నారు.

మలక్‌పేటలో బైక్ రేసింగ్‌లు

- రెచ్చిపోతున్న పోకిరీలు
- హడలిపోతున్న పాదచారులు



మలక్‌పేట జాతీయ రహదారిపై బైక్ విన్యాసాలు చేస్తున్న యువకులు



బీ–బ్లాక్‌కు వెళ్లే దారిలో..

మలక్‌పేట: బైక్ రేసింగులు, బైక్ విన్యాసాలతో యువకులు రహదారులపై హోరెత్తిస్తున్నారు. మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అక్బర్‌బాగ్ బీ–బ్లాక్, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో రోడ్లపై బైక్ రేసింగులు నిత్యకృత్యమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే జాతీయ రహదారితో పాటు అంతర్గత రోడ్లపై బైక్ విన్యాసాలు చేస్తున్నారు. అస్మాన్‌ఘడ్ వాటర్ వర్క్స్ కార్యాలయం నుంచి బాలికల జూనియర్ కాలేజ్ వరకు, మూసారంబాగ్ మెట్రో పరిసరాలు, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో రోడ్లపై నంబర్ ప్లేట్ లేని బైక్‌లపై అధిక వేగంతో రయ్.. రయ్ మంటూ చక్కర్లు కొడుతున్నారు. దీంతో ఇతర వాహనదారులు, పాదచారులు హడలిపోతున్నారు. పోకిరీల బెడద పెరిగిందని, దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని స్థానికులంటున్నారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెట్టి బైక్ రేసింగ్‌లు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆహారనాళంలో ఇరుక్కుపోయిన మటన్ ఎముక

- నెల రోజులుగా వృద్ధుడికి తీవ్రమైన నొప్పి
- ఎండోస్కోపీతో ఎముకను తీసిన కామినేని వైద్యులు



రోగిని మీడియాకు చూపిస్తున్న డాక్టర్ రాధిక నిట్టల

మన్సూరాబాద్: ఆహార నాళంలో ఇరుక్కుపోయిన మటన్ ఎముకను క్లిష్టమైన ఎండోస్కోపీ చికిత్స విధానం ద్వారా బయటకు తీసి ఓ వృద్ధుడికి తీవ్రమైన నొప్పి నుంచి ఉపశమనం కలిగించారు ఎల్బీనగర్‌లోని కామినేని ఆసుపత్రి వైద్యులు. ఆసుపత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ రాధిక నిట్టల తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేన్ గ్రామానికి చెందిన ఏళ్ల శ్రీరాములు (66) నెల రోజుల క్రితం ఓ పెళ్లిలో మటన్ తిన్నాడు. పళ్లు లేకపోవడంతో పొరపాటున ఎముకను మింగేశాడు. అది ఆహార నాళంలో ఇరుక్కుపోవడంతో ఇన్‌ఫెక్షన్ అయి ఎద భాగం మధ్యలో తీవ్రమైన నొప్పితో బాధపడుతూ నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి వెళ్లాడు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆహార నాళంలో ఎముక ఉందని, మెరుగైన చికిత్స కోసం ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. ఇక్కడి వైద్యులు ఎముక వల్ల ఆహార నాళానికి రంధ్రం ఏర్పడిందని, ఇన్‌ఫెక్షన్ ఏర్పడి పుండ్లు కూడా పడ్డాయని గుర్తించి ప్రమాదకరంగా ఉందని, అరుదైన ప్రోసిజర్‌తో చికిత్స చేయాలని రోగి కుటుంబ సభ్యులకు వివరించారు. అతి జాగ్రత్తగా అరుదైన ఎండోస్కోపీ విధానంతో ఎముకను తొలగించామని డాక్టర్ రాధిక తెలిపారు. ఏ వయస్సు వారైనా తినేటప్పుడు బాగా నమిలి తినాలని, ఎముకలను యథాతథంగా తినవద్దని, తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జెడ్పీహెచ్‌ఎస్ (2002-03) బ్యాచ్ విద్యార్థులు

మాడ్గుల: మండల కేంద్రంలోని నాగిళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనంను ఘనంగా నిర్వహించారు. 2002–03 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన వారంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు శ్రీను, యాదగిరి, జగన్, శ్రీశైలం, అశోక్, తిరుపతి, శారద, పద్మ, గీత, నిర్మల, అవంతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌లో పోలింగ్ 46.27%

- మొత్తం ఓటర్లు 6,04763
- పోలైనవి 2,79,795
- పురుషుల ఓట్లు 1,45,787
- మహిళలు 1,33,977
- ఇతరులు 31



సోమవారం పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్లు

ఎల్‌బీనగర్: రాష్ట్రంలో సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎల్‌బీనగర్‌లో అసెంబ్లీ సెగ్మెంట్‌లో 46.27 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గ పరిధిలో 6,04,763 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,14,101 మంది, మహిళా ఓటర్లు 2,90, 528 మంది ఉన్నారు. ఇతరులు 134 మంది, సోమవారం జరిగిన పోలింగ్‌లో 2,79,795 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 1,45,787 మంది, మహిళలు 1,33,977 మంది, ఇతరులు 31 మంది ఉన్నారు. మొత్తానికి పోలింగ్ సరళని చూస్తే 40 శాతం కూడా దాటదని ప్రధాన పార్టీలకు చెందిన వారు ఆందోళన చెందారు. ఉదయం పోలింగ్ కేంద్రాలకు భారీగా చేరుకున్న ఓటర్లు 11 గంటల తర్వాత పోలింగ్ కేంద్రాల వద్ద ఒకరిద్దరు దర్శనమిచ్చారు. సాయంత్రం వేళల్లో తిరిగి పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్లు చేరుకుని ఓట్లు వేశారు. దీంతో పోలింగ్ శాతం అనూహ్యంగా పెరిగింది.

'ఇండోనేపాల్' అవార్డుల ప్రదానోత్సవానికి ఆహ్వానం



సినీ దర్శకుడు డాక్టర్ వీసీ ఆదిత్య

నాగోలు: నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్‌లో జూన్ 9న జరగనున్న ప్రతిష్టాత్మక ఇండో నేపాల్ అంతర్జాతీయ అవార్డుల ప్రదానోత్సవానికి గౌరవ అతిథిగా విలక్షణ దర్శకుడు డాక్టర్ వీసీ ఆదిత్యకు ఆహ్వానం అందింది. ఈ మేరకు తనకు బీహార్‌కు చెందిన నీరజ్ గ్రీన్ ఇండియా పరివార్ ఫౌండేషన్ అధినేత నీరజ్ గుప్తా ఆహ్వానం పంపారని వీసీ ఆదిత్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సినిమా షూటింగ్ నిమిత్తం గతంలో తాను నేపాల్ దేశంలో లొకేషన్స్ సందర్శించానని, ఈసారి గౌరవ అతిథిగా గ్రీన్ ఇండియా ఫౌండేషన్ నిర్వహించే అంతర్జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొనడం తెలుగు దర్శకుడిగా తనకు గర్వంగా ఉందని ఆదిత్య పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారులలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాట 23, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 35, క్యాబేజి 18, ఫ్రెంచి బీన్స్ 85, క్యారెట్ 35, దొండ 28, చిక్కుడు 65, గోకర 35, బీట్‌రూట్ 23, క్యాప్సికం 45, ఆలు 28, దోస 15, సొర 11, పొట్ల 15, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 40. బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

టీఎంఆర్‌జేసీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మన్సూరాబాద్: డివిజన్ పరిధి సూర్యోదయనగర్ కాలనీలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల (టీఎంఆర్‌జేసీ) బాలానగర్ బాలికల్లో వచ్చే విద్యాసంవత్సరానికి (2024–25) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.వినీల తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ముస్లిం మైనార్టీలకు–51, క్రిస్టియన్లకు–5, జైన్, పార్సీ, బౌద్ధులు, సిక్కులకు–4 సీట్లు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు నం. 9160255040లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

18 నుంచి సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

వనస్థలిపురం: ఎన్జీఓస్ కాలనీలోని గణేష్ ఆలయంలో ఈ నెల 18 నుంచి జూన్ 1న హనుమజ్జయంతి వరకు.. ప్రతినిత్యం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కె. ధర్మారావు గుప్తా, ప్రధాన కార్యదర్శి పీవీకే సోమయాజులు తెలిపారు. అలాగే ఈ నెల 31 నుంచి జూన్ 5 వరకు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు ఫోన్ నం. 9390197132 ను సంప్రదించాలన్నారు.

సీనియర్ సిటిజన్లు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



ఉచితంగా వైద్య శిబిరంలో పాల్గొన్న నర్సింహారెడ్డి, రాఘవరెడ్డి తదితరులు

నాగోలు: సీనియర్ సిటిజన్లు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా చైర్మన్ నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ ఫోరం నాగోలు కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో వృద్ధుల సంచార వైద్యం (మొబైల్ మెడికేర్ యూనిట్) ద్వారా వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా బీపీ, షుగర్ ఇతర పరీక్షలు నిర్వహించి నెల రోజులకు సరిపడా మందులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ వి. పాండ్ గౌడ్, ట్రెజరర్ చల్లా రాఘవరెడ్డి, మెంబర్ మురళీధర్, కాలనీ అధ్యక్షుడు శరత్ రెడ్డి, ఎం.నర్సింహారెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం సెక్రటరీ కోటిరెడ్డి, సత్యనారాయణ, భీమయ్య, పెరుమాళ్లు పాల్గొన్నారు.

వేసవిలో మజ్జిగతో ఉపశమనం



చిత్రలేవుట్ కాలనీలో మజ్జిగ పంపిణీ చేస్తున్న రామచంద్రరావు

దిల్‌సుఖ్‌నగర్: వేసవి కాలంలో మజ్జిగతో ఎంతో ఉపశమనం కలుగుతుందని ఎస్‌ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రామచంద్రరావు అన్నారు. మంగళవారం ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలో జాగృతి అభ్యుదయ సంఘం సహకారంలో పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ, వేసవి కాలంలో పాదచారులు, స్థానికుల దాహార్తి తీర్చేందుకు, ఎండ నుంచి ఉపశమనం కోసం మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శోభ, చిత్రలేవుట్ కాలనీలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు నగేష్, బీజేపీ జాతీయ నాయకులు శేఖర్ రావు, కుసుమ, రామకృష్ణ, కిషోర్ రెడ్డి, నగేంద్ర, భావనా శ్రీనివాస్, సీతారామశర్మ, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ శ్రీనిలయం ఫ్లాట్ ఓనర్స్ సొసైటీ కార్యవర్గం ఎన్నిక



భరత్



రవీందర్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఎల్‌బీనగర్ ఆర్టీసీ కాలనీ చింతల్‌కుంటలోని వాసవీ శ్రీనిలయం ఫ్లాట్ ఓనర్స్ మెయింటనెన్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీకి పాలకవర్గాన్ని ఇటీవల ఎన్నుకున్నారు. మొత్తం 12 మందితో కూడిన పాలకవర్గంలో అధ్యక్షునిగా కట్టా భరత్, ఉపాధ్యక్షునిగా గార్లపాటి రవీందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. వీరిద్దరే ప్రస్తుతానికి ఆఫీస్ బేరర్లుగా ఉన్నారు. ఈ పాలకవర్గం పదవీకాలం మూడేళ్లు ఉంటుంది. పాలకవర్గం సభ్యులుగా డి.హర్షవర్ధన్ రెడ్డి, కొత్త శ్రీకాంత్, అలకొండ వెంకట్ రెడ్డి, ఎం.ఎస్.బాలాజీ, గోవిందు ఉమ, తోట విజయలక్ష్మి, అక్బర్ షేక్, తిరునగరి వెంకట అచ్యుతరాం, తుంగతుర్తి సంజీవరావు, చావ పరమేశ్వరి ఉన్నారు. ఈ సందర్భంగా కట్టా భరత్ మాట్లాడుతూ అధ్యక్షునిగా ఎన్నుకున్న సొసైటీ ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. సొసైటీ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, దాని అభివృద్ధికి శాయశక్తులా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.

వైభవంగా అష్టలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ప్రాభోదిక, శ్రీ సుదర్శనేష్టి, ద్వారతోరణ, బలి ప్రదానం, మహాపూర్ణాహుతి, చూర్ణోత్సవం, చక్రతీర్థం, కల్పవృక్షవాహన సేవ, రథోత్సవం నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్సీ బొగ్గారపు దయనంద్ గుప్తా, ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, కమిటీ సభ్యులు గంప జగన్, ఐతే అంజయ్య గుప్తా, గౌరిశెట్టి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



అష్టలక్ష్మి ఆలయంలో రథోత్సవం

మహేశ్వరం నియోజకవర్గంలో 52.70% పోలింగ్

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గంలో 52.70 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని మొత్తం 537 పోలింగ్ స్టేషన్లు, మొత్తం ఓటర్లు 5,56,741 ఉండ గా అందులో 2,93,387 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. మహేశ్వ రం మండలంలో 67,983 మంది ఓటర్లకు 48,888 పోలై 71.91శాతం నమోదైంది. కందుకూరు మండలంలో 50,437 మంది ఓటర్లకు 40,067 ఓట్లు పో లై 79.44శాతం, సరూర్‌నగర్ మండలం 1,26,649 మంది ఓట్లకు 53,506 ఓట్లు పోలై 42.25శాతం నమోదైంది. బాలాపూర్ మండలం 3,11,672 ఓట్లకు 1,50,926 ఓట్లు పోలై 48.42శాతం ఓటింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని అత్యధికంగా కందుకూరు మండలం 79.44శాతం నమోదు కాగా, అత్యల్పంగా సరూర్‌నగర్ మండలం 42.25శాతం నమోదైంది.

త్రిపుర గవర్నర్‌ను కలిసిన జర్నలిస్టులు



జర్నలిస్టులతో భేటీ అయిన గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

సైదాబాద్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు నగరానికి వచ్చిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డిని మలక్‌పేట నియోజకవర్గ సీనియర్ జర్నలిస్టులు కలుసుకున్నారు. మంగళవారం ఉదయం సలీంనగర్ కాలనీలోని నివాసంలో త్రిపుర గవర్నర్ జర్నలిస్టులతో భేటీ అయ్యారు. మలక్‌పేట నియోజకవర్గంతో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్న ఆయన జర్నలిస్టుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్రిపురకు సంబంధించిన రాజకీయ, సాంస్కృతిక, పర్యాటక, చరిత్ర వంటి పలు అంశాలను జర్నలిస్టులు ఆయనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన జర్నలిస్టులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్టులు ఉన్నారు.

భగీరథ మహర్షికి ఘన నివాళి



భగీరథ మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: సగరుల కులదైవం భగీరథ మహర్షి జయంతిని మన్సూరాబాద్ ఆటోనగర్‌లోని మహావీర్ హరిణ వనస్థలి జాతీయ పార్కులో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సగర సంఘం సభ్యులు లక్ష్మీనారాయణ, రాఘవ, శ్రీను, నాగరాజు, చిన్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈటల గెలుపు ఖాయం: కార్పొరేటర్ రంగా

చైతన్యపురి: పార్లమెంట్‌లో ఎన్నికల్లో మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు ఖాయమైందని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా అన్నారు. మంగళవారం జరిగిన బీజేపీ నాయకులు, బూత్ కమిటీ ఇన్‌ఛార్జీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన ఈటల రాజేందర్ ఎంపీగా గెలిచి తీరుతారని, ప్రచారంలోను, ఎన్నికల పోలింగ్‌లోను ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని ఈటలకు ఓటు వేశారన్నారు. ప్రచారంలో సహకరించిన నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎంబీటీ నేతకు గాయాలు

చాదర్‌ఘాట్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో ఎంబీటీ నేతకు గాయాలయ్యాయి. చాదర్‌ఘాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం... చంచల్‌గూడలో నివసించే ఎంబీటీ అధికార ప్రతినిధి అమ్జదుల్లా ఖాన్ మంగళవారం ఉదయం మలక్‌పేటలో బంధువును పరామర్శించి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. అక్బర్‌బాగ్ చౌరస్తా వద్ద వాహనం అదుపు తప్పడంతో కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అమ్జదుల్లా చేతికి, తలకు గాయాలయ్యాయి. మలక్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడిగా గండి జగన్



జగన్‌కు నియామకపత్రం అందజేస్తున్న మధుయాష్కీ గౌడ్

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్‌కు చెందిన గండి జగన్ యాదవ్ పీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరు పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జగన్ యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే అని అన్నారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రితో పాటు మధుయాష్కీలకు జగన్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

విక్టోరియాకు సత్కారం



విక్టోరియాను సత్కరిస్తున్న డాక్టర్ ప్రభు కిరణ్, రాజాజీ ప్రసాద్

కాచిగూడ: అంతర్జాతీయ ఫిన్ స్విమ్మర్ కాచిగూడకు చెందిన గంధం క్వీనీ విక్టోరియాకు డేస్ స్ప్రింగ్ క్రిస్టియన్ యూనివర్సిటీ నుంచి స్పోర్ట్స్‌లో గౌరవ డాక్టరేట్ లభించింది. సువార్త శాంతి ప్రార్థన సంస్థ చైర్మన్ డాక్టర్ ప్రభుకిరణ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆమెకు డాక్టరేట్ అందించి సత్కరించారు. కార్యక్రమంలో రెవరెండ్ రాజాజీ ప్రసాద్, జీపీపీ మహిళా అధ్యక్షురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు వినయం అవసరం



పురస్కార గ్రహీతలు బాలలతో జస్టిస్ బి.చంద్రకుమార్, రాము, ఎస్పీ భారతి, రేణుకా శ్రీనివాసులు

చిక్కడపల్లి: కళాకారులకు వినయం ఎంతో అవసరమని హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. రసమయి సంస్థ ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన రసమయి బాలల ఉగాది పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ కళలపై శ్రద్ధ వహిస్తే గుర్తింపు అదే వస్తుందని అన్నారు. ఈర్ష్య ద్వేషాలతో మనశ్శాంతిని కోల్పోతామన్నారు. ఈ సందర్భంగా నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, వీణ, ఛాయగ్రహణం సృజనాత్మక కళల్లో ప్రతిభావంతులైన బాలలకు పురస్కారాలు ప్రదానం చేసి సన్మానించారు. నిర్వహణ సంస్థ అధ్యక్షుడు రసమయి రాము అధ్యక్షత వహించిన సభలో కూచిపూడి నాట్యగురువు ఎస్పీ భారతి, రేణుక శ్రీనివాసులు, ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత మొలుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజయంపై ఎవరి ధీమా వారిదే!

- ఈవీఎంలో అభ్యర్థుల జాతకాలు నిక్షిప్తం
- అంతు చిక్కని ఓటర్ల నాడి
- ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకుల్లో టెన్షన్



సునీతామహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి



ఈటల రాజేందర్ బీజేపీ అభ్యర్థి



రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి

చంపాపేట: పార్లమెంట్ ఎన్నికల ఘట్టం ముగియడంతో మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీలో నిలచిన ప్రధాన పార్టీల అభ్యర్థులకు గెలుపుపై టెన్షన్ మొదలైంది. తమ తమ పార్టీ అభ్యర్థుల విజయం కోసం ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సర్వశక్తులు ఒడ్డి పని చేశారు. ఓటర్లు అభ్యర్థుల రాజకీయ భవితవ్యాన్ని ఎలక్ట్రానిక్ యంత్రాల్లో భద్రపర్చారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో ఈ 20 రోజులూ తమ పార్టీ అభ్యర్థుల విజయంపై ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరికి వారే లెక్కలు వేసుకుంటుండగా, ఎల్‌బీనగర్‌లోని ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు మాత్రం బయటకు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నప్పటికీ ఓటింగ్ శాతం తాము ఊహించినంతగా లేకపోవటంతో లోలోపల మాత్రం వారిలో ఆందోళన నెలకొంది.

- మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలో ఎల్‌బీనగర్‌తో పాటు మరో ఆరు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఎంపీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల గెలుపోటములు నిర్ణయించే అధిక ఓటర్లు కలిగిన ఎల్‌బీనగర్ శాసన సభ నియోజకవర్గ పరిధిలో 6,04,763 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ 46.27 శాతం మాత్రమే కావటంతో ఆ ప్రభావం ఏ పార్టీ అభ్యర్థి జయాపజయాలపై చూపుతుందోనని పార్టీ కార్యకర్తలు ఆందోళనలో ఉన్నారు,
- మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేయడం వల్ల ఎల్‌బీనగర్ వాసులు, అన్ని పార్టీల నాయకులతో ఆయనకు సత్సంబంధాలు ఉన్నాయి. దానికి తోడు ఎల్‌బీ నగర్ నియోజకవర్గ పరిధిలోని మెజార్టీ డివిజన్లలో బీజేపీ కార్పొరేటర్లు ఉన్నారు. దీంతో ఆయన తన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఆ పార్టీ కార్పొరేటర్లు, క్రియాశీలక కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఈటల విజయం కోసం ఏమాత్రం పాటు పడ్డారో అభ్యర్థి జయాపజయాలను నిర్ణయిస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
- బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విజయం కోసం స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఉన్న కొద్దిపాటి పార్టీ కార్యకర్తలను ఎప్పటికప్పుడు జాగృతం చేస్తూ రాగిడి విజయానికి అహర్నిషలు కృషి చేశారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై ఉన్న సానుభూతి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు నోచుకోక పోవటం వంటి అంశాల వల్ల రాగిడి లక్ష్మారెడ్డికి ఎల్‌బీ నగర్‌లో మెజారిటీ ఓట్లు వచ్చి విజయం ఖాయమని పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్ రెడ్డికి ఎల్‌బీనగర్‌లోని పలు పార్టీ నేతలతో పరిచయాలు, బంధుత్వాలు ఉన్నాయి. దీనికి తోటు ఎన్నికల సమయంలో భారీ ఎత్తున ఇతర పార్టీల నుంచి కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరి బూత్ స్థాయినుంచి పార్టీ ఇన్‌చార్జీలను నియమించి పార్టీని మరింత బలోపేతం చేయడం వంటి కారణాల వల్ల పార్టీ అభ్యర్థి ఎల్‌బీ నగర్‌లో మెజార్టీ ఓట్లు సాధించడం పక్కా అని అంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటరు నాడి అంతు చిక్కటంలేదని, ఓటర్లు ఎక్కడా తమ మనోభావాన్ని, అంతరంగాన్ని బయట పెట్టడం లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.